

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




**కొందరు రోగులు** మూలుగుతున్నారు. కొందరు రోగులు నీలుగుతున్నారు. వార్డులో విద్యుద్దీపాలు చమురు చాలని వొత్తుల్లా వెలుగుతున్నాయి. అవాళ నైట్ డ్యూటీ లేకపోయినా బాలరాజు యింకా డ్యూటీ రూమ్‌లోనే వున్నాడు. స్టాఫ్ నర్స్ మందాకిని వచ్చి, యియేల తవకి' డూటీనేదుగా యింటికెళ్ళా డ్రాటారూ' అని అడిగింది.

'వెళ్తాను' ఆ కార్నర్ బెడ్‌లో డయాబెటిక్ పేషెంట్‌కి షుగర్ లెవెల్స్ యింకా స్టెబిలైజ్ కాలేదు. యింకో టు అవర్లీ శాంపుల్స్ చూశాక వెళ్తాను' అన్నాడు బాలరాజు.

'ఏటోనండి. ఈ యంగు డాకటర్లెవరూ డూటీలో వున్నా పిలిచినా పలకరు. తవరేమో రేతిరీ లేదు పగలూ లేదు. యవా డివోసను' మళ్లీ అంది మందాకిని.

'అవును సిస్టర్. కష్టపడి పనిచేసి మంచి డాక్టరవ్వాలని మా నాన్నగారి కోరిక. నా కోరికా అంతే.'

'ఏటోనండి. ఏ డాకటరెంత జేసినా యీ పేసెంటోల్లకోలెక్కా - బతికితే బగవంతుడి దయంటారు. లేకపోతే డాకటర్లు తిన్నగా సై లేదంటారు.'

'ఓ కవిగారేవన్నారో తెలుసా సిస్టర్'

'ఏటన్నారేటి?'

''నలిపేసే చేతికి కూడా సౌరభాన్నిస్తుందిట పువ్వు'

'సెబాసో. అందుకే ఆయన్ని కయిగారన్నారు' మందాకిని మెచ్చుకుంది.

మెచ్చుకుని 'మెడికేసిన్లకి టయిమైంది. ఆల్లకి మాత్తర్లు పంచుతా డ్రాటారూ' అంటూ కదిలింది.

బాలరాజు తన చేతిలో వున్న మెడిసెన్ టెక్స్ట్ బుక్‌లోకి తలదూర్చాడు. తల దూర్చేముందు స్టాఫ్ నర్స్ మందాకిని వెనుకభాగం చూశాడు. అందమైన గుర్రం నడిచి నట్టుంది. రేఖ గుర్తొచ్చింది. రేఖ నడక కూడా గుర్తొచ్చింది. ఏవిటో

యిద్దరూ చాలాసార్లు కారిడార్స్‌లోనూ, క్యాంటీన్‌లోనూ కలుస్తున్నా యిద్దరిమధ్యా సుదీర్ఘమైన సంభాషణలేం జరగడంలేదు. రేఖకి వేరే వార్డ్సులో పోస్టింగ్స్. చాలా నెలలుగా వీచిన ప్రేమగాలుల విసురు తగ్గి తనకు చదువుమీద, కెరీర్ మీద శ్రద్ధ పెరిగింది. ఏవనుకుంటోందో తను. యిష్టం తగ్గిపోయిందనుకుంటోందా? తన యిష్టం గురించి తప్పకుండా తెలిసేవుంటుంది. అయినా తనకిష్టం వుందో లేదో అందుకే అంతగా పట్టించుకోవడంలేదేమో. అయినా ఆడపిల్ల పట్టించుకోవాలని అనుకోవడం యేవిటీ, తనే కదపాలి కానీ బాలరాజు మనసు పరి పరి విధాల ఆలోచిస్తోంది -

బాగా లేటయింది. బాలరాజు కదిలాడు. వార్డు వదిలి అవుట్ గేట్ వేపు నడుస్తున్నాడు.

'ఏవిటి? ఈ మధ్య రోజూ నైట్ ఆన్ కాల్ చేస్తున్నట్టున్నారు?'

చెవిలో వెయ్యివీణలు మోగినట్టు రేఖ పలకరింపు. తన వెనకే నడుస్తూ వచ్చి కలిసింది. రేఖ తనంతట తాను తనను పలకరించడం యిదే ప్రథమం. తన ఆలోచనకి యెంతబలం తనలో తనే నివ్వెరపోయాడు బాలరాజు.

'వేరే వార్డులో పనిచేస్తున్నా నా డ్యూటీల గురించి మీకు బాగా తెలుసే' అన్నాడు.

'నాకేకాదు. మన కొలీగ్స్ అందరికీ తెలుసు. ఈ మధ్య డ్యూటీలకి బాగా అంకితమైపోతున్నారని.'

'ఏదోలెండి. ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ దొరికేదాకా పేషెంట్‌ను వదిలి రాలేకపోతున్నాను. తొందర్లోనే మన డెసిషన్స్ మనమే తీసుకోవాలి. అందుకే యీ ఆరాటం.'

'మంచిదే. గుడ్ డాక్టరయ్యే క్వాలిటీ. ఏదో అనుకున్నాను. మీరు ఏదో కాదు'

'అనుకున్నది అనుకున్నట్టు చెప్పడంలోనే తెలుస్తోంది మీ నిర్మలమైన మనసు. అందుకేనేమో మీ గురించి తరచూ తలుచుకుంటాను.'

'ఏం తలుచుకుంటారో'

'మీకు తెలుసులెండి.'

'అలాగా'

'అవును. అలాగే'

ఇద్దరూ కలిసి నవ్వుకున్నారు. ఔట్ గేట్‌లో రేఖ తనకోసం లేచివున్న కారెక్కుతూ' రండి. మిమ్మల్ని డ్రాప్ చేస్తాను.' అంది. బాలరాజు క్షణం సందేహించాడు. 'ఫర్వాలేదు. ఎక్కండి. ఇక మనం ఆగం' అంది.

'అవును. మనమింక ఆగం' అంటూ బాలరాజు కారెక్కాడు.

తర్వాత వారం యువడాక్టర్లందర్నీ లాసెన్స్ బే కి తీసుకెళ్ళారు సీనియర్ సర్జన్ పదును పాపారావుగారు. ఆయన యింగ్లాండ్‌లో చాలా రోజులు పనిచేసి చాంతాడంత పొడుగైన దొర డిగ్రీలు సంపాదించి తిరిగి వచ్చారు. భావి డాక్టర్లను తన సలహాలతో తీర్చిదిద్దడానికి తీసుకొచ్చారు. సరుగుడు చెట్ల మధ్య లాసెన్స్ బేలో శాంతి ఆశ్రమం అతి మనోహరంగా వుంది. చెట్లు గుబుర్లు వొత్తుగా వున్నాయి. సైకతాలు మెత్తగా వున్నాయి. సముద్రపుటలల విరుపులు మత్తుగా వున్నాయి. రేఖ సమీపంలో బాలరాజుకి అన్నీ అలానే వుంటాయి. అంతా యిసుకలో కూర్చున్నారు. కొంతమంది కాఫీలు తెచ్చుకున్నారు. మరి కొంతమంది ఐస్ క్రీములు తెచ్చుకున్నారు.

సర్జన్ మేష్టారు పదును పాపారావుగారు అందర్నీ వుద్దేశించి మాట్లాడటం ప్రారంభించారు.

'వినండోయ్ కుర్రడాక్టర్లూ. నేను చెప్పేది శ్రద్ధగా వినండి. ఇది వేదంకాదు. కేవలం నా అనుభవంతో నేను నేర్చుకున్న విషయాలు మీకు వుపయోగిస్తాయని చెబుతున్నాను. ఎవడో అన్నాడు, ఎక్కడ వొదగాలో, యెక్కడ యెక్కాలో తెలుసుకో అని. అలాగే మీరు యెక్కడ కొయ్యాలో, యెక్కడ కుట్లేసి ముయ్యాలో కచ్చితంగా చెయ్యాలి. అనుభవం కావాలంటే అదర్ హాస్పిటల్స్‌లో కూడా పనిచేయండి. ఇంకా పెరగాలంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చైండి. కావల్సిన చోట జాబ్ కావాలంటే యెవడికి యెంత లంచం యివ్వాలో తెల్సుకోండి. అమెరికా, యు.కె లాంటి దేశాలకు వెళ్లి మంచి క్వాలిఫికేషన్లు పొంది మంచి కంఫర్టబుల్ లైఫ్ గడపాలంటే వారి ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ పాసై, వీసాలు తీసుకుని ఎగరండి' అని సర్జన్ పాపారావుగారు ఆగారు.

'ఫారిన్‌లో ఎలా ప్రోగ్రెస్ అవాలో చెప్పండి సార్' అనడిగాడొక యంగ్ డాక్టరు.

'వస్తున్నా. వస్తున్నా. అక్కడ నా అనుభవం దృష్ట్యా అన్నీ మీకు వివరిస్తాను' అంటూ కంటిన్యూ చేశారు.

'నేను యెన్నో దేశాలు తిరిగినా, యెక్కువ పనిచేసింది ఇంగ్లండ్‌లో. అక్కడ బాగా చలి. ఏడాదిలో ఆరునెలలు అయితే మరీ యెక్కువ చలి. సూర్యుడు తనకి తోచినప్పుడు కనిపిస్తాడు. అలా కనిపించినా వెలుగు తప్ప వేడివుండదు. వెళ్లగానే మీకు లాంగ్ టెర్మ్ జాబ్స్ దొరకవు. లోకమ్స్‌గానీ, ఆర్నెల్ల జాబ్స్‌గానీ వెతుక్కోవాలి. బుద్ధిగా పనిచేసి. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి తయారవుతూ తర్వాత జాబ్స్ వెతుక్కోవాలి. కొత్త జాబ్స్‌కి రిఫరెన్సులు కావాలి. తెల్లవాడి రిఫరెన్సులు అయితే బెటరు. మన వెధవలు తిన్నగా యివ్వరు, వొకవేళ యిచ్చినా వేస్టు. మన వెధవలకి మరో జబ్బు వుంది. తెల్లవాడిని తృప్తి పరుస్తున్నాననుకుంటూ సాటి మనిషైన మనల్ని వాడి ముందు చిన్న చూపు చూస్తూ తక్కువచైడానికి ప్రయత్నిస్తారు. తెల్లవాడి గురించి మనం చాలా కథలు విన్నాం. మన దేశాన్ని కొల్లగొడుతూ పరిపాలించాడని, అప్పుడు భారతీయుల్ని చిత్రహింసలు పెట్టాడని, యెదురు తిరిగిన వాళ్లను చంపేశాడని రకరకాలుగా. కానీ నేనక్కడ పనిచేయడానికి వెళ్లినప్పుడు తెల్లవాడు మన వాళ్లని యెంతో మర్యాదగా చూడటం తెలుసు. మనకి తెలీకపోతే చక్కగా తెలిసేలా చెబుతాడు. మనకి తెలిస్తే ఆనందిస్తాడు. అంతేగానీ మన వెధవల్లా అరవడం, విసుక్కోవడం, పులి డ్యాన్స్‌లు చైడం చెయ్యడు. అంచేత మీలో యెవరేనా ఫారిన్ వెళ్తే, మన వృత్తి మీద శ్రద్ధ పెడితే మంచి డాక్టర్లయి తిరిగి వచ్చి మన వాళ్లకి సేవ చెయ్యవచ్చు'

పదును పాపారావు మళ్లీ ఆగారు. కుర్ర డాక్టర్లంతా చెవులు రిక్కించి ఋషిప్రోక్తం వింటున్న శిష్యుల్లా అలా ఆ శాంతి ఆశ్రమంలో ఏకాగ్రతలో మునిగిపోయారు.

సర్జరీ మేష్టారు మళ్లీ మొదలెట్టారు.

'మరొక్క విషయం. ముఖ్యంగా అబ్బాయిలకి. మీరిప్పుడు మంచి వయసులో వున్న కుర్రాళ్లు. మీకంటికిప్పుడు వయసులో వున్న గాడిద కూడా గంధర్వ కన్యలా కనిపిస్తుంది. మరి అక్కడ తెల్లపిల్లలు ఏపుగా యెదిగి మహా టెంప్టింగా వుంటారు. వాళ్లని చూసి వెళ్లిన పని మానేసి వాళ్ల వెనకాల పడితే -'

'పడితే?' అబ్బాయిలు కోరస్‌లో అడిగారు.

'పడితే యేముంది. వాళ్లకిష్టమైతే మీరు క్షవరం. ఇష్టం లేకపోతే కేసులు, కోర్టులు - మీ జీవితాలే గందరగోళం. పొరపాటున తెల్లపిల్ల వొళ్లు తగిల్తే వెంటనే 'సారీ' అనడం నేర్చుకోండి. సర్దుకుపోతుంది. భాషాభిమానం యెక్కువ.

అనుకోకుండా బాలరాజు చెయ్యి, రేఖ చేతికి తగిలింది. 'సారీ అన్నాడు.

రేఖ 'సరే' అంది చూపు తిప్పకుండా.

( కొనసాగింపు వచ్చేనెలలో)




Post your comments